క్లుప్తంగా

మల్లేశ్వరుని సేవలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ వెంకట జ్యోతిర్మయి దంపతులకు స్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

పెదకాకాని: గుంటూరు జిల్లా పెదకాకానిలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకట జ్యోతిర్మయి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తికి అధికారులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన జస్టిస్ వెంకట జ్యోతిర్మయి దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ వేద పండితులు స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు. ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

గాయత్రీ పరివార్ కలశ శోభాయాత్ర



పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు పట్టణంలో గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో శోభాయాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు వార్షికోత్సవం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున కలశ శోభాయాత్ర నిర్వహించారు. సాక్షి భావనారాయణస్వామి గుడి నుంచి ప్రారంభమైన శోభాయాత్ర గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా ఐలాండ్ సెంటర్ మీదుగా సాగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 2400 దీపాలతో గాయిత్రీ దీప మహాయజ్ఞం నిర్వహించారు.

యువకుడు అదృశ్యంపై కేసు నమోదు



హరికృష్ణ(ఫైల్)

శ్రీరంగపురం(చేబ్రోలు): మానసిక పరిస్థితి సరిగా లేని యువకుడు అదృశ్యం అయిన ఘటనపై చేబ్రోలు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. చేబ్రోలు మండలం శ్రీరంగపురం గ్రామానికి చెందిన 23 ఏళ్ల వయసు కలిగిన చెరుకూరి హరికృష్ణకు మానసిక పరిస్థితి సరిగా లేదు. ఈ నెల 25వ తేదీన రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాలను పరిశీలించినప్పటికి ఆచూకి లభించక పోవటంతో యువకుడి తండ్రి చెరుకూరి వెంకటేశ్వరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడు అదృశ్యంపై ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయం క్యాంటిన్ వంట సామగ్రి అప్పగింత

పెదకాకాని: శివాలయం క్యాంటిన్‌లో వంట సామగ్రిని పాటదారుడికి అప్పగించినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెదకాకాని శివాలయం క్యాంటీన్ లీజుకు తీసుకుని నిర్వాహకుడు చికెన్ తీసుకు రావడంపై 2022 ఏప్రిల్ 7వ తేదీన దుమారం లేచింది. ఆలయ ప్రాంగణంలోకి చికెన్ తీసుకు వచ్చిన పాటదారుడు అల పాటి మణికంఠతో పాటు క్యాంటీన్ నిర్వాహకుడు షేక్ షరీఫ్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. అలానే ఆగస్టు 9వ తేదీన శివాలయం క్యాంటీన్‌ను సీజ్ చేశారు. త్వరలో శివాలయం క్యాంటీన్‌కు వేలం నిర్వహించనున్న నేపథ్యంలో రెవెన్యూ, పోలీసుల సహకారంతో శనివారం క్యాంటీన్ తాళాలు తీసి పాటదారుడికి అందులో ఉన్న వంట సామగ్రి అప్పగించారు. కార్యక్రమంలో ఆలయ ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ దినేస్‌రాఘవేంద్ర, ఎస్ఐ పాదర్తి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

చేబ్రోలు: పాత కక్షల నేపథ్యంలో వృద్ధుడిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చేబ్రోలు మండలం వీరనాయకునిపాలేనికి చెందిన తోట సాంబయ్యను కొద్ది రోజుల క్రితం అదే ప్రాంతానికి చెందిన తోట గోపీనాథ్ పాతకక్షల నేపథ్యంలో సపోట తోటల దగ్గర కత్తితో దాడి చేశాడు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో సాంబయ్య చికిత్స పొందుతున్నాడు. సాంబయ్య కుమారుడు కొండల రాయుడు చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. మండల పరిధిలోని వడ్లమూడి అడ్డరోడ్డు వద్ద నిందితుడు గోపీనాథ్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

వెంకట్రావు సేవలు మరువలేనివి

తెనాలి అర్బన్: పేద విద్యార్థులకు మంచి భవిష్యత్‌ను అందించిన వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల వ్యవస్థాపకులు నన్నపనేని వెంకట్రావు సేవలు మరవలేనివని డబుల్ హార్స్ మినపగుళ్ల సంస్థ అధినేత మునగాల శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. వెంకట్రావు వర్ధంతిని శనివారం కళాశాల ఆవరణలో నిర్వహించారు.

రైతు ఇంటి ముందుకే పశువైద్యం



వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ మొబైల్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుచరిత

పెదనందిపాడు: రైతు ఇంటి ముందుకే నాణ్యమైన పశువైద్యం అందించటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ మొబైల్ వాహనాలను ప్రారంభించారని మాజీ హోంమంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మధ్యాహ్నం పెదనందిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ మొబైల్ వాహనాన్ని శనివారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సాయిమందిర్ వద్ద అన్నదాన సత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ షేక్ ఖాశింబి, సర్పంచి దాసరి పద్మారావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్లు షేక్ ఖాశీంపీరా, కొండా కృష్ణారెడ్డి, ఉపసర్పంచి డి.రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా భావనారుషి స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



కొత్తరెడ్డిపాలెంలో భావనారుషి విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమంలో భక్తులు

చేబ్రోలు: మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని భద్రావతి సమేత భావనారుషి స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా పండితులు వివిధ హోమాలు, పూజలు నిర్వహించారు. అశ్వనీ నక్షత్రయుక్త మీన లగ్న పుష్కరాంశమందు మహా గణపతి, సుబ్రమణ్యేశ్వర పులి వాహన, జీవ ధ్వజ, విమాన కలశ సహిత భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల యంత్ర బింబ ప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి కల్యాణం జరిగింది. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రతిష్టా మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీసీ కులాల వారీగా జనగణన చేపట్టాలి

నెహ్రూనగర్: దేశవ్యాప్తంగా బీసీ కులాల వారీగా జనగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పాల రాజ్‌కిరణ్ డిమాండ్ చేశారు. చుట్టుగుంటలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తేనే న్యాయం జరుగుతుందని తెలిపారు. మన ఓటు మన భావితరాల కోసం, మన అభివృద్ధి కోసం అనే నినాదంతో బీసీలంతా ముందుకు సాగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కుమ్మర క్రాంతికుమార్, కొల్లూరి హనుమంతురావు, తురక శ్రీకాంత్ పాల్గొన్నారు.

హెల్మెట్లతో ప్రమాదాల నుంచి రక్షణ

జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నగరంపాలెం: ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్లను ధరించడం వల్ల ప్రమాదాల నుంచి రక్షణ లభిస్తుందని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ శనివారం తెలిపారు. జిల్లాలో హెల్మెట్ల వాడకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పోలీస్ అధికారుల్ని ఆయన ఆదేశించారు. వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచంగా ఉంటుందన్నారు. చోదకులు, విద్యార్థులకు 'సేఫ్టీ ఫస్ట్ హెల్మెట్ మస్ట్' అనే నినాదంతో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారే మృత్యువాతకు గురవుతున్నారని, దీనికి హెల్మెట్లు ధరించకపోవడమే కారణమని తెలిపారు.

రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో హెల్మెట్ల వాడకంపై చోదకులకు అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారునిపై కుటుంబ సభ్యులు ఆధారపడి ఉంటారని, తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలని ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పశ్చిమ, తూర్పు సీఐలు ఎం.శేషగిరిరావు, నిస్సార్ బాషా, ఎస్ఐలు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ పోతే ట్రాకింగ్

మొబైల్ ఫోన్ పోతే గుంటూరు పోలీస్ వాట్సాప్ 8688831574 నంబర్‌కు హాయ్ అని మేసేజ్ చేయాలని గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ శనివారం తెలిపారు. దీని తర్వాత వెంటనే లింక్‌తో కూడిన మేసేజ్ వస్తుందన్నారు. దాన్ని ఓపెన్ చేసి వివరాలు తెలిపి, అప్లికేషన్ సబ్మిట్ చేయాలని సూచించారు. అనంతరం మొబైల్ ఫోన్ ట్రాక్ చేసి పోయిన వారిని సంప్రదిస్తామని పేర్కొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థినులకు అవగాహన

నెహ్రూనగర్: రుతుక్రమ సమయంలో విద్యార్థినులు జాగ్రత్తలు పాటించాలని గుంటూరు అర్బన్-1 సీడీపీఓ టి. కృష్ణవేణి సూచించారు. స్టాల్ గర్ల్స్ హైస్కూలులో శనివారంలో రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సమయంలో పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో శానిటరీ నాప్కిన్స్ వాడాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం ఆనందకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ భవనానికి నీలం సంజీవరెడ్డి పేరు పెట్టాలి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల మెన్స్ హాస్టల్ నూతనంగా నిర్మాణం చేస్తున్న నేపథ్యంలో ఆ భవనానికి మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నీలం సంజీవరెడ్డి పేరు పెట్టాలని అవర్ స్టేట్ అవర్ లీడర్ వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం ఫౌండర్ చైర్మన్ జి.శాంతమూర్తి కోరారు. ఈ మేరకు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతి దేవిని శనివారం కలసి వినతి పత్రం అందజేశారు. మెన్స్ హాస్టల్‌ను డాక్టర్ నీలం సంజీవరెడ్డి 1958న ప్రారంభించారని, నేడు నూతనంగా భవనాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో నీలం సంజీవరెడ్డి పేరు నూతన భవనానికి పెట్టాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో స్వామివార్ల కల్యాణాలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: బ్రాడీపేట 2వ లైనులోని శ్రీ సిద్దేశ్వరీ పీఠ పాలిత ఓంకార క్షేత్రంలో శ్రీ సీతా రామాంజనేయ నగర సంకీర్తన సంఘం 93వ వార్షికోత్సవాలు, 89వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. తొలుత రథసప్తమి సందర్భంగా శనివారం ప్రాంగణంలోని శ్రీ సూర్యనారాయణమూర్తికి విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా ఉదయం పద్మావతి అండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామికి అభిషేకార్చనలు నిర్వహించారు. స్వామివార్ల కల్యాణాల్లో భాగంగా ఆలయ అర్చకుడు బుజ్జి బృందం ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ శ్రీ గోదా రంగనాథుల కల్యాణం, శ్రీ సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణాల్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు ముత్యాల తలంబ్రాలతో వేడుకగా కల్యాణాల్ని జరిపించారు. మంత్రపుష్పం, ఆశీర్వాదం అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాల్ని అందుకున్నారు. శ్రీమద్రామాయణం ప్రవచనంలో భాగంగా శ్రీ రాముడు శివ ధనుస్సు విరవడం, సీతాదేవి శ్రీరాముని వరమాలతో అలంకరించడం సన్నివేశాల్ని మంచికంటి సత్యవతి ఆసక్తికరంగా వివరించారు. కార్యక్రమాన్ని కార్యదర్శి నంబూరి శ్రీ వేంకటనారాయణమూర్తి పర్యవేక్షించారు.

దేవదాయ శాఖ స్థలం స్వాధీనం

గుంటూరు ఈస్ట్: సుదీర్ఘ కాలంగా ఆక్రమణలో ఉన్న స్థలాన్ని దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రైలుపేటలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి చెందిన 50 గజాల స్థలంలో అనధికారికంగా ఓ వ్యక్తి సాయిబాబా మందిరం నిర్మించి అతని ఆక్రమణలో ఉంచుకున్నాడు. దేవదాయ శాఖ అధికారులు కోర్టుకు అప్పీలు చేయగా, అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో పోలీసులు, రెవెన్యూ అధికారుల సహాయంతో అసిస్టెంట్ కమిషనర్ బొంతు మహేశ్వరరెడ్డి, ఈఓ కోటా వీరాంజనేయులు స్థలాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నారు.

ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి తోడ్పడండి



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులతో యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు

పూర్వ విద్యార్థులకు వీసీ సూచన

ఏఎన్‌యూ: విలువైన సూచనలు, సలహాలు ఇచ్చి ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి తోడ్పడాలని పూర్వ విద్యార్థులకు వీసీ ఆచార్య పి. రాజశేఖర్ సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ చదివిన కళాశాల, యూనివర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావడం ప్రతి విద్యార్థి బాధ్యతగా భావించాలని చెప్పారు. ఇంజినీరింగ్ కళాశాలకు పూర్వ విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లని తెలిపారు. ఉద్యోగంలో ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని, ప్రస్తుత విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి యూనివర్సిటీ నుంచి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్దయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో మరింత నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఇంక్యుబేషన్ సెంటర్లు, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. బిగ్‌డేటా ఎనలటిక్స్, శాటిలైట్ డేటా ఎనాలసిస్ సెంటర్ ద్వారా ఆదర్శవంతమైన పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు. యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ ఆచార్య జీవీఎస్ఆర్ ఆంజనేయులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పని చేసే సంస్థల ద్వారా యూనివర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఇంజినీరింగ్ డీన్ ఆచార్య ఈ. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధి అవకాశాలు విరివిగా ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునే నైపుణ్య లక్షణాల్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘ సమావేశ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎండీ తౌసీఫ్, పలువురు అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కళాకారుల కాలనీలో నివసించే ఐమళ్ల ప్రకాష్ (29) సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. కొద్దికాలం కిందట ఆమె అతడితో విభేదించి వెళ్లిపోయింది. దీంతో మస్తాపానికి గురైన ప్రకాష్ ఈనెల 26న పురుగు మందు తాగాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు మాయంపై కేసు నమోదు

పట్నంబజారు: ఆన్‌లైన్‌లో నగదు మాయమైన ఘటనపై కేసు నమోదైంది. వివరాలు.. మేడికొండూరు పొట్లపాడు గ్రామానికి చెందిన కొమ్మూరి కృష్ణకిశోర్ మహిళా ప్రభుత్వ కళాశాల వద్ద రోడ్డు మార్జిన్‌లో సన్‌గ్లాస్‌ల షాపు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రూ. 1లక్ష రుణం కోసం ఆన్‌లైన్ యాప్ పరిశీలిస్తుండగా గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. క్విక్ సపోర్ట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సదరు వ్యక్తి సూచించాడు. దీంతో కృష్ణకిశోర్ అతని బ్యాంక్ వివరాలు, కేవైసీని అందులో పొందు పరిచాడు. దీంతో కొద్దిసేపటి వ్యవధిలోనే కృష్ణకిశోర్ అకౌంట్‌లో రెండు దఫాలుగా రూ. 43 వేలు డ్రా అయినట్లు మేసేజ్ రావడంతో పోలీసుల్ని ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాల వాడకం అనర్థాలపై అవగాహన కల్పించాలి

నగరంపాలెం: మాదక ద్రవ్యాల వాడకంతో వచ్చే అనర్థాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని డీసీపీఎస్ మేనేజర్ విజయకుమార్ చెప్పారు. మహిళలు, చిన్నారుల విభాగం ఆధ్వర్యంలో శనివారం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్పందన హాలులో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ పాఠశాలలకు దగ్గరలో నిషేధిత గుట్కాలు, సిగిరెట్‌లు, పాన్ తదితర వాటిని అరికట్టాలని చెప్పారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల వ్యవస్థపై మరింతగా అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సెబ్ సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ, జిల్లా బాలల రక్షణాధికారిణి దుర్గభవాని, బచావన్ బచావో ఆందోళన్ రాష్ట్ర సమన్వయకర్త తిరుపతిరావు, చైల్డ్ లైన్ సమన్వయకర్త సమీర్‌కుమార్, సుగుణరాణి, సీసీఎస్, డీసీఆర్‌బీ సీఐలు బెల్లం శ్రీనివాసరావు, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

గణపతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పాత గుంటూరు: ఎస్వీఎన్ కాలనీలోని శ్రీ పద్మావతీ గోదాసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ విజయగణపతిస్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భగవత్ ప్రార్థన, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విగ్వరణ, అఖండ స్థాపన, రక్షా బంధన, దీక్షాధారణ, మృత్సంగ్రహణ, అంకురారోపణ, నీరాజన మంత్ర పుష్ప తీర్థప్రసాద గోష్టి తదితర కార్యక్రమాల్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దంపతులు భక్తిప్రపత్తులతో పాల్గొన్నారు. కార్యక్రమాల్ని ఆలయ పాలకమండలి పర్యవేక్షించింది.

వ్యవసాయాన్ని లాభసాటిగా మలుచుకోవాలి

ఉద్యానశాఖ సహాయ సంచాలకులు శ్రీకాంత్ రెడ్డి



మహిళా రైతుకు సర్టిఫికెట్ అందిస్తున్న ఉద్యానశాఖ సహాయ సంచాలకులు శ్రీకాంత్ రెడ్డి

గుంటూరు రూరల్(ప్రత్తిపాడు): వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించి మంచి ధరలు లభించే ప్రాంతాల్లో అమ్మకాలు చేపట్టడం ద్వారా పంటల సాగు లాభదాయకంగా ఉంటుందని ఉద్యానశాఖ సహాయ సంచాలకులు కె.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. నాబార్డు సాయంతో వట్టిచెరుకూరు మండలం రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులు వివిధ పంటలను రకరకాల పద్ధతులతో సాగు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో రైతులకు లాభాలు రావడం లేదన్నారు. పంటల సాగును లాభాల బాటలో నడిపించాలంటే ఉత్పత్తులకు విలువ జోడించడం ఒక్కటే మార్గమన్నారు. వీఏఎస్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ ఒకప్పుడు ప్రతి రైతు పంటల సాగుతోపాటు కొన్ని పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలను పోషించే వారన్నారు. కాని ప్రస్తుతం రైతులు తమ పూర్తి సమయాన్ని ఒక్క పంటల సాగుకు మాత్రమే కేటాయిస్తున్నారని చెప్పారు. అనుబంధ రంగాలను అశ్రద్ధ చేయడం వలన రైతులకు అదనపు ఆదాయ వనరులు లేకుండా పోయాయని వివరించారు. డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ పశుపోషణకు సూపర్ నేపియర్ పశుగ్రాసం మరియు పప్పుజాతి పశుగ్రాసాలైన దశరద గడ్డి లేదా స్టైలో లాంటి వాటిని జీవాలకు మేతగా అందించి తక్కువ ఖర్చుతో రైతులు లాభసాటిగా గొర్రెల పెంపకంను చేపట్టవచ్చని చెప్పారు. ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుధ తేనే టీగల పెంపకం విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు, వీఏఎస్ డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

కిట్స్‌లో ముగిసిన శిక్షణ తరగతులు

వట్టిచెరుకూరు(ప్రత్తిపాడు): మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కిట్స్)లో నిర్వహిస్తున్న మోటివేషన్ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈనెల 27, 28 తేదీల్లో సీఎస్‌సీ విభాగానికి చెందిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన రెండో సంవత్సరం విద్యార్థులకు ట్రాన్స్ఫర్మేషన్ సెల్ఫ్ అండ్ రిలేషన్ షిప్ మీద మోటివేషన్ తరగతులను నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సోషల్ ఇంపాక్ట్ సొల్యూషన్స్ కో ఫౌండర్ శివశంకర్ కంతేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థి దశలోనే జీవిత లక్ష్యాలను ఎంచుకోవాలని సూచించారు. జీవితంలో జరిగే ఘటనల నుంచి తమని తాము ఎలా మార్చుకోవాలన్న దానిపై విద్యార్థులకు వివరించారు. కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా అభివృద్ధి చెందడానికి తమ కళాశాలలో ప్రతి ఏటా ఇలాంటి మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయ శేఖర్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, విభాగాధిపతి డాక్టర్ జి.మురళి పాల్గొన్నారు.

లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా చేపట్టాలి



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్న లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్స్ ఓపెనింగ్ త్వరగా పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులు, ఎమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. పేరేచర్లలోని జగనన్న లేఅవుట్‌లో శనివారం నగర పాలక సంస్థ ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులతో కలసి ఇళ్ల నిర్మాణ పురోగతిపై చర్చించారు. లే అవుట్స్‌లో లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని, నగరపాలక సంస్థ నుంచి కూడా తోడ్పాటు అందిస్తామని తెలిపారు. కాంట్రాక్టర్ తప్పనిసరిగా ప్రతి రోజూ నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు చేయాలని, రోజువారి నివేదిక ఎప్పటికప్పుడు తమకు అందించాలని ఆదేశించారు. లే అవుట్‌లో ఎక్కడైనా విద్యుత్ స్తంభాల అవసరం ఉంటే ముందే సదరు శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనే బృహత్ ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాల్ని పంపిణీ చేసిందని, అందుకు అనుగుణంగా లబ్ధిదారులు తప్పనిసరిగా ఇంటి నిర్మాణం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. నిర్మాణ సమయంలోనే మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ రమేష్‌బాబు, హౌసింగ్ ఈఈ శంకరరావు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నగర శాఖ నూతన కార్యవర్గం



ఎం. చిన్నయ్య, అధ్యక్షుడు, కె. ప్రభూజీ, ప్రధాన కార్యదర్శి

గుంటూరు ఎడ్యుకేషన్: యూటీఎఫ్ నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం. చిన్నయ్య, కె. ప్రభూజీ ఎన్నికయ్యారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం నగరశాఖకు నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగర శాఖ గౌరవాధ్యక్షునిగా కొండపల్లి వేంకటేశ్వరరావు, సహాధ్యక్షులుగా ఈ. రాధ, జి. ప్రసాదరావు, కోశాధికారిగా బురాన్ అలీ, ఆడిటర్‌గా డి. చంద్రశేఖర్ ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకునిగా వ్యవహరించిన సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కళాధర్ తెలిపారు.

నిత్య జీవితంలో ఇంటర్నెట్ ప్రాధాన్యం అపారం



మాట్లాడుతున్న కేఎస్వీ సాంబశివరావు

గుంటూరు ఎడ్యుకేషన్: నిత్య జీవితంలో ఇంటర్నెట్‌కు ప్రాముఖ్యత ఉందని విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి కె.ఎస్.వి.సాంబశివరావు పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం ''ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విత్ ఆర్డినో'' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంబశివరావు మాట్లాడుతూ నేడు ఇంటర్నెట్ అవసరం ఎంతో కీలకంగా ఉందని, ప్రతి పని దానితో ముడిపడి ఉందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ మానవుని నిత్య జీవితంలో ఆహారం, నీరు, వస్త్రాలు, ఇల్లు ఎంత ప్రాముఖ్యత సంతరించుకున్నాయో, ఇంటర్నెట్ ప్రాముఖ్యత సైతం అదే స్థాయిలో ఉందని తెలిపారు. ఇళ్లల్లో టీవీ, ఫ్యాన్స్, కంప్యూటర్, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్ వంటి వాటిని మన మొబైల్‌లో రిమోర్ట్‌లా ఏర్పాటు చేసుకుని ఉపయోగించుకోవచ్చని, తద్వారా సమయంతో పాటు ఆర్థికంగా పొదుపు చేయవచ్చని సూచించారు. రైతులు రాత్రిపూట నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లకుండా ఇంటి నుంచే 'ఆర్డినో' ద్వారా అనుసంధానం చేసి ఆపరేట్ చేయవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి బి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, యం. బాజీ, భౌతికశాస్త్ర అధ్యాపకులు సాయి, గంగా భవాని, రామతులసి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదిత్య హృదయం, విష్ణు సహస్ర పారాయణ

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై రథసప్తమి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ 27వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రముఖ సాహితీవేత్త డాక్టర్. కె.వి. శ్రీరంగనాయకి ఆధ్వర్యంలో ఆదిత్య హృదయ పారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. ప్రముఖ సాహితీవేత్త నిష్టల సుబ్రహ్మణశాస్త్రి భీష్మ ఏకాదశి విశిష్టతపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమంలో పరిషత్ వ్యవస్థాపకులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. శ్రీరంగనాయకి, సుబ్రహ్మణశాస్త్రిలను ఘనంగా సన్మానించారు.